



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం,
జూన్ 5, 2026

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-


# హైదరాబాద్‌లో ఎబోలా కలకలం




## గాంధీ ఆసుపత్రిలో ముగ్గురు అనుమానితులు

- ఒకే అంతర్జాతీయ విమానంలో ప్రయాణించిన ముగ్గురిలో లక్షణాలు
- సూడాన్ నుంచి వచ్చిన ప్రయాణికుడికి ఎయిర్‌పోర్ట్‌లోనే గుర్తింపు
- నిర్ధారణ కోసం నమూనాలను పుణె వైరాలజీ ల్యాబ్‌కు పంపిన అధికారులు
- ఆందోళన వద్దని, అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆరోగ్య శాఖ వెల్లడి

## అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం

# స్తంభించిన ట్రాఫిక్

- మైత్రివనం ప్రాంతంలో అగ్నిప్రమాదం
- తొలుత ఆటబొమ్మల దుకాణంలో మంటలు
- క్రమంగా కేఎస్ఆర్ కాంప్లెక్స్‌కు వ్యాప్తి
- ఎలాంటి ప్రాణనష్టం లేదని పోలీసుల వెల్లడి
- పొగ కమ్మేయడంతో నిలిచిపోయిన ట్రాఫిక్



## చంచల్‌గూడ జైల్లో బాల్క సుమన్‌ను కలిసిన కేటీఆర్

- సింగరేణి ఆస్తులను ధ్వంసం చేయాలంటూ బాల్క సుమన్ వ్యాఖ్యలు
- చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సుమన్
- కేటీఆర్‌తో పాటు జైలుకు వెళ్లిన తలసాని, సుధీర్ రెడ్డి





## వైఎస్ చనిపోయి 17 ఏళ్లు అయ్యాక కూడా ఆరోపణలా?

- పవన్ కల్యాణ్ కు కేవీపీ రామచంద్రరావు లేఖ
- రాజశేఖరరెడ్డిపై విమర్శలు గుప్పించిన పవన్ కల్యాణ్
- పవన్ వ్యాఖ్యలను ఖండించిన కేవీపీ రామచంద్రరావు
- వైసీపీకి, వైఎస్సార్ కు సంబంధం లేదని వ్యాఖ్య
- పాత కక్షలు మర్చిపోవాలని హితవు

# ఆరు నెలల్లో 'పాలమూరు' నీరు


## భూసేకరణ తర్వాతే ప్రాజెక్టుల నిర్మాణం పనులు

- భూసేకరణ, పునరావాసానికే తొలుత నిధుల కేటాయింపు
- యుద్ధప్రాతిపదికన భూసేకరణ పూర్తి చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదే..
- ప్రాజెక్టులకు నిధుల కొరత లేకుండా చూసుకుంటాం..
- మంత్రులు.. ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, అధికారులతో సమన్వయం చేసుకోవాలి..
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టుల పురోగతిపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష



హైదరాబాద్: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 6 నెలల్లో కర్వెన రిజర్వాయర్ వరకు నీరందించాలని చెప్పారు. దీంతోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఇతర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణను సత్వరంగా పూర్తి చేసేందుకు అత్యంత

(మిగతా 2వ పేజీలో)





విదేశీయుల వివరాలు

## 24 గంటల్లో ఇవ్వాలి

: హైదరాబాద్ పోలీసుల హెచ్చరిక

- హైదరాబాద్‌లో బస చేసే విదేశీయుల వివరాలు 24 గంటల్లో సమర్పించాలి
- ఇమ్మిగ్రేషన్ చట్టం 2025 ప్రకారం పోలీసుల తాజా అడ్వైజరీ
- నిబంధనలు పాటించని యజమానులు, విద్యాసంస్థలపై కఠిన చర్యలు
- విదేశీయుల కదలికలపై నిఘా పెంచడమే లక్ష్యమన్న పోలీసులు



## భూముల విలువ పెంపు

- రిజిస్ట్రేషన్ ఆఫీసులకు పోటెత్తిన జనం
- తెలంగాణ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద భారీ రద్దీ
- భూముల మార్కెట్ విలువలు, ఛార్జీల పెంపు నేపథ్యంలో జనం పరుగులు
- రద్దీని దృష్టిలో ఉంచుకొని పనివేళలు పొడిగించిన ప్రభుత్వం
- రాత్రి 7:30 గంటల వరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు అనుమతి

2లో

## నా యుద్ధ అధికారాల్ని పరిమితం చేయడం దేశద్రోహం..



- నలుగురు రిపబ్లికన్లు, డెమోక్రాట్లందరూ దేశ విరోధులు
- డెమోక్రాట్లపై ట్రంప్ ఆగ్రహం

2లో

## ఫోన్ ట్యాపింగ్ కేసు: సస్పెండెడ్ ఏఎస్పీ భుజంగరావు అరెస్ట్, రూ.100 కోట్లకు పైగా ఆస్తుల గుర్తింపు



- ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు భుజంగరావు అరెస్ట్
- ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన ఏసీబీ
- ఏకకాలంలో 15 ప్రాంతాల్లో సోదాలు.. రూ.5.92 కోట్ల ఆస్తుల గుర్తింపు
- న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలింపు

# అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం.. స్తంభించిన ట్రాఫిక్

నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్ అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మైత్రివనం దగ్గర్లోని కేఎస్ఆర్ షాపింగ్ మాల్‌లో మంటలు చెలరేగాయి. తొలుత ఓ ఆటబొమ్మల దుకాణంలో చెలరేగిన మంటలు క్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ మొత్తం వ్యాపించాయి. పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వస్తువులు ఉండడంతో మంటలు వేగంగా అంటుకున్నాయి. మైత్రివనం ప్రాంతంలో అనేక ఆఫీసులు, కోచింగ్ సెంటర్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు ఉంటాయనే విషయం తెలిసిందే. మంటల ధాటికి ఆ ప్రాంతమంతా పెద్ద ఎత్తున పొగ అలముకుంది. రోడ్డు కనపడనంత తీవ్రంగా పొగ కమ్మేయడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నాయి. నాలుగు ఫైరింజన్లు మంటలను ఆర్పుతున్నాయి. మరోవైపు పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. మంటలు చెలరేగిన వెంటనే షాపింగ్ కాంప్లెక్స్‌లోని వారంతా బయటకు పరిగెత్తుకొచ్చారు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని ప్రాథమికంగా పోలీసులు తేల్చారు. కానీ, చాలా దుకాణాలు దగ్ధం అవడంతో ఆస్తి నష్టం మాత్రం భారీగా ఉండే అవకాశం ఉంది. అలాగే షార్ట్ సర్క్యూటే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. మరోవైపు సమీపంలోనే మెట్రో స్టేషన్‌లో కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం లేదని అధికారులు తెలిపారు. సర్వీసులు యథావిధిగా కొనసాగుతున్నట్లు చెప్పారు.

# శ్రీసిటీలో రైల్వే రోలింగ్ మిల్లు..

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్, తన పర్యటనలో మూడో రోజు కీలక సమావేశం నిర్వహించారు. రష్యాకు చెందిన ప్రముఖ మెటలర్జికల్ హోల్డింగ్ కంపెనీ 'నోవోస్టల్-ఎం' చైర్మన్ ఇవాన్ డెమ్చెంకోతో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో భేటీ అయ్యారు. భారత్‌లో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించి, పలు కీలక ప్రతిపాదనలు ఆయన ముందుంచారు. భారత్‌లో ప్రస్తుతం పారిశ్రామిక వాతావరణం అత్యంత అనుకూలంగా ఉందని లోకేష్ తెలిపారు. పర్యావరణ అనుమతులు వేగంగా లభిస్తున్నాయని, మౌలిక సదుపాయాల మార్కెట్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని వివరించారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకుని, అత్యుత్తమ శ్రేణి రీబార్, వైర్ రాడ్‌లను తయారుచేసే అత్యాధునిక ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేస్ (ఈఏఎఫ్) స్టీల్ ప్లాంట్‌ను భారత్‌లో నిర్మించాలని లోకేష్ విజ్ఞప్తి చేశారు. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో తక్షణ రైల్వే సైడింగ్ కనెక్టివిటీతో కూడిన స్ట్రక్చరల్ సెక్షన్, రైల్వే ట్రాక్ రోలింగ్ మిల్లును ఏర్పాటు చేయాలని కోరారు. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ పరిధిలోని ఆటోమోటివ్, షిప్‌బిల్డింగ్ పరిశ్రమలకు నేరుగా ముడిసరుకు అందించేందుకు ప్రత్యేకమైన హార్డ్‌వేర్ గాల్వనైజ్డ్ వైర్ ఫ్యాక్టరీని నిర్మించాలని సూచించారు. వీటితో పాటు, ముడి పదార్థాల లాజిస్టిక్స్ హబ్‌ను అభివృద్ధి చేయడానికి జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయాలని, తక్కువ కర్బన ఉక్కు తయారీలో భాగస్వాములు కావాలని ప్రతిపాదించారు.

# భూముల విలువ పెంపు

తెలంగాణలో భూముల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయనే వార్తల నేపథ్యంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు జనంతో కిటకిటలాడాయి. పాత ధరలకే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకునేందుకు గురువారం ఉదయం నుంచే ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 4న రాత్రి 7:30 గంటల వరకు పనివేళలను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న వాస్తవ ధరలకు, అధికారిక రిజిస్ట్రేషన్ విలువలకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది రేపటి నుంచి అమలులోకి వస్తుండటంతో, పెరిగే ఛార్జీల భారం నుంచి తప్పించుకునేందుకు కొనుగోలుదారులు కార్యాలయాల వద్ద బారులు తీరారు. ప్రజల రద్దీ, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న రెవెన్యూ శాఖ, ప్రత్యేకంగా గురువారం పనివేళలను పొడిగించింది. టోకెన్లు తీసుకున్న వారందరి రిజిస్ట్రేషన్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. ప్రభుత్వం పనివేళలు పొడిగించి సౌలభ్యం కల్పించినా, భారీ సంఖ్యలో జనం రావడంతో వ్యవస్థపై ఒత్తిడి నెలకొంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసు: సస్పెండెడ్ ఏఎస్పీ భుజంగరావు అరెస్ట్, రూ.100 కోట్లకు పైగా ఆస్తుల గుర్తింపు



తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న సస్పెండెడ్ అదనపు ఎస్పీ నాయిని భుజంగరావును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అరెస్ట్ చేసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆయనను నిన్న అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో అధికారులు ఆయన్ను చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించారు. నిన్న ఉదయం నుంచి ఏసీబీ అధికారులు భుజంగరావుతో పాటు ఆయన బంధువులు, సన్నిహితులకు చెందిన సుమారు 15 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని హఫీజ్‌పేట, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో ఈ తనిఖీలు జరిగాయి. ఈ సోదాల్లో రూ.5.92 కోట్ల విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలను గుర్తించినట్లు ఏసీబీ అధికారులు అధికారికంగా ప్రకటించారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల్లో 27.29 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లో రెండు ఇళ్లు, ఐదు ఓపెన్ ప్లాట్లు, ఒక వాణిజ్య భవనం ఉన్నాయి. వీటితో పాటు రూ.3.83 లక్షల నగదు, కిలో బంగారం, రెండు కార్లను కూడా గుర్తించారు. ఈ ఆస్తుల డాక్యుమెంట్ విలువ రూ.5.92 కోట్లుగా ఉన్నప్పటికీ, బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.100 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భుజంగరావు ఇంట్లో 29 మద్యం సీసాలు లభించడంతో, ఆ విషయాన్ని ఎక్సైజ్ శాఖకు నివేదించినట్లు ఏసీబీ తెలిపింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖుల ఫోన్లను అక్రమంగా ట్యాపింగ్ చేశారన్న ఆరోపణలపై నమోదైన కేసులో భుజంగరావు నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో ఆయనను 2024 మార్చిలో అరెస్ట్ చేయగా, తర్వాత తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తాజాగా అక్రమాస్తుల కేసు నమోదు కావడంతో ఏసీబీ ఆయన్ను మరోసారి అరెస్ట్ చేసింది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

# 6 నెలల్లో 'పాలమూరు' నీరు

ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు స్పష్టంచేశారు. ప్రధాన భూసేకరణను వేగవంతం చేయాలని, ఈ బాధ్యతను కలెక్టర్లు తీసుకోవాలని సూచించారు. భూసేకరణ పూర్తయిన తర్వాతే ప్రాజెక్టుల నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు చెప్పారు. గురువారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిలలోని మృగవాణి రిసార్ట్‌లో అధికారులతో రేవంత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకం కింద పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి వేగంగా పూర్తిచేయాలని సీఎం చెప్పారు. నార్లాపూర్, ఏదుల, కరివెన రిజర్వాయర్ల నిర్మాణం పూర్తికాగా, వీటి లింకేజీకి సంబంధించి పెండింగ్ పనులను పూర్తిచేయాలన్నారు. వీటికి నిధుల కొరత లేకుండా ప్రభుత్వం చూసుకుంటుందని చెప్పారు. నెలవారీగా ప్రాజెక్టు పనులను పూర్తిచేసేందుకు అవసరమైన నిధుల వివరాలను ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. తక్కువ నిధులతో పూర్తయ్యే పనులను వేగంగా పూర్తిచేయాలన్నారు. ఆరు నెలల్లోగా కరివెన రిజర్వాయర్ వరకు నీళ్లు అందించే లక్ష్యంగా పనులు వేగవంతం చేయాలని చెప్పారు. మరో 15 రోజుల తర్వాత ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్షిస్తానన్నారు. ఎప్పటికప్పుడు ఇంజినీరింగ్ అధికారులు సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన తొలి రోజు గురువారం చకచకా సాగింది. కర్ణాటక రాష్ట్ర చిన్న నీటి పారుదల శాఖ మంత్రి బోసురాజు, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో కలిసి పలు ప్రాజెక్టులను సందర్శించారు. కొడంగల్-- నారాయణపేట-- మక్తల్ ఎత్తిపోతలు, గుడ్డెందొడ్డి పంప్‌హౌస్ పనుల ప్రగతిపై స్వయంగా ఆరా తీశారు. కోయిల్‌సాగర్, కృష్ణా, భీమా నదులపై రోడ్ కం బరాజ్‌ల ప్రతిపాదిత స్థలం, జూరాల డ్యామ్‌ను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. రాత్రి 10 గంటల వరకు సమీక్ష నిర్వహించిన అనంతరం సోమశిలలోని మృగవాణి రిసార్ట్‌లో రేవంత్‌రెడ్డి బస చేశారు. శుక్రవారం పాలమూరు-- రంగారెడ్డి ఎత్తిపోతలు, ఎంజీకేఎల్ఐలో భాగమైన పలు రిజర్వాయర్లు, పంప్‌హౌస్ పనులను పరిశీలించ నున్నారు. సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోని గంగాపూర్ రోడ్‌లో ఉన్న మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడనున్నారు. మక్తల్-- నారాయణపేట-- కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూనే నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, నీటిపారుదల రంగాన్ని మరింత బలోపేతం చేసి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్యాకేజీల వారీగా పురోగతిపై రేవంత్‌రెడ్డి ఒక్కో ప్యాకేజీలో పెండింగ్ పనులకు గత కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నార్లాపూర్ రిజర్వాయర్ పనులు నూరు శాతం పూర్తికాగా, ఏదుల రిజర్వాయర్ పనులు 95 శాతం పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. వట్టెం రిజర్వాయర్ కట్ట పనులు పూర్తికాగా, ప్రస్తుతం కాంక్రీట్, రివిట్‌మెంట్ పనులు కొనసాగుతున్నాయన్నారు. గడువులోగా పనులు పూర్తిచేసేందుకు అవసరమైన నిధుల అంచనాలను త్వరగా అందించాలని అధికారులను ఆదేశించారు.

# మళ్లీ తెరపైకి డీలిమిటేషన్ బిల్లు..

దేశ రాజకీయాల్లో మరోసారి డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) అంశం చర్చనీయాంశంగా మారింది. కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లును మళ్లీ పార్లమెంట్ ముందుకు తీసుకురావాలని యోచిస్తున్నట్లు సమాచారం. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో ఏర్పడిన అంతర్గత సంక్షోభం, తమిళనాడులో డీఎంకే-కాంగ్రెస్ పొత్తు విరగడం వంటి తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ అంశం మళ్లీ వేగం అందుకున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అధికార వర్గాల సమాచారం ప్రకారం.. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బీజేపీ నాయకత్వం టీఎంసీ, డీఎంకే సహా పలు ప్రాంతీయ పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. జనాభా మార్పుల ఆధారంగా లోక్‌సభ స్థానాల పునర్విభజన జరిగితే తమ రాష్ట్రాలకు నష్టం కలుగుతుందనే ఆందోళనలను నివారించడంతో పాటు విస్తృత రాజకీయ ఏకాభిప్రాయం సాధించడమే ఈ ప్రయత్నాల ఉద్దేశంగా చెబుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీలో విభేదాలు తీవ్రరూపం దాల్చాయి. పార్టీకి చెందిన 58 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసి రితబ్రతా బెనర్జీని శాసనసభ పక్ష నేతగా ఎన్నుకుని స్పీకర్ గుర్తింపు కూడా పొందారు. 28 ఏళ్ల చరిత్ర కలిగిన టీఎంసీలో ఇది తొలి అధికారిక చీలికగా భావిస్తున్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పరాజయం అనంతరం టీఎంసీలో అసంతృప్తి పెరిగినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ చేతుల్లో అధికారం కేంద్రీకృతమవుతోందనే భావన కొందరు ఎమ్మెల్యేల్లో పెరిగిందని సమాచారం. ఇప్పుడు ఎమ్మెల్యేల తర్వాత ఎంపీల్లో కూడా విభేదాలు చెలరేగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తమిళనాడులో చాలా కాలంగా కలిసి సాగిన డీఎంకే-కాంగ్రెస్ సంబంధాలు కూడా ఇటీవల దెబ్బతిన్నాయి. ముఖ్యమంత్రి పదవికి టీవీకే అధినేత విజయ్‌కు కాంగ్రెస్ మద్దతు ప్రకటించడంతో డీఎంకే ఆగ్రహం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ పార్టీ డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్ నుంచి వైదొలగి విజయ్‌కు మద్దతు ఇవ్వడంతో ఇరు పార్టీల మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. ఈ నేపథ్యంలో డీఎంకే శాసనసభ్యుల సమావేశంలో కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తూ తీర్మానం ఆమోదించారు. అంతేకాకుండా డీఎంకే ఎంపీ కనిమొళి లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యుల నుంచి తమ పార్టీ ఎంపీలకు ప్రత్యేక సీటింగ్ ఏర్పాటు చేయాలని స్పీకర్‌కు లేఖ రాశారు. ఇక జూన్ 8న జరగనున్న ఇండియా కూటమి సమావేశానికి కూడా డీఎంకే దూరమైంది. లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచడం, మహిళా రిజర్వేషన్ అమలుకు అవసరమైన రాజ్యాంగ సవరణ బిల్లు ఈ ఏడాది ఏప్రిల్ 18న లోక్‌సభలో ఓటింగ్‌కు వెళ్లి విఫలమైంది. బిల్లుకు అనుకూలంగా 298 మంది సభ్యులు ఓటు వేయగా.. 230 మంది వ్యతిరేకించారు. అయితే రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ (352 ఓట్లు) రాకపోవడంతో బిల్లు ఆమోదం పొందలేదు. ఆ బిల్లు ప్రకారం 2011 జనగణన ఆధారంగా డీలిమిటేషన్ నిర్వహించి 2029 ఎన్నికల నాటికి లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 543 నుంచి గరిష్ఠంగా 850కు పెంచే ప్రతిపాదన ఉంది.

# వైఎస్ చనిపోయి 17 ఏళ్లు అయ్యాక కూడా ఆరోపణలా?

దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి పాలనపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. వైఎస్సార్ హయాంలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, ప్రజలు రోడ్డుపైకి రావాలంటేనే భయపడేవారంటూ పవన్ చేసిన కామెంట్స్ పై కాంగ్రెస్ సీనియర్ నేత, వైఎస్సార్ ఆత్మబంధువు డాక్టర్ కేవీపీ రామచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేస్తూ ఒక ఘాటు బహిరంగ లేఖను సంధించారు. "కాంగ్రెస్ అనగానే మీకు వైఎస్సార్ గుర్తుకు వచ్చినందుకు ధన్యవాదాలు" అంటూనే... వైఎస్సార్‌పై పవన్ చేసిన ఆరోపణలను కేవీపీ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ముఖ్యమైన రాజకీయ అంశాన్ని స్పష్టం చేశారు. వైఎస్సార్‌కు, ప్రస్తుత వైసీపీకి ఎలాంటి సంబంధం లేదని కేవీపీ తేల్చి చెప్పారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పవన్ పై ఎలాంటి అక్రమ కేసులు పెట్టలేదని కేవీపీ గుర్తు చేశారు. నాడు వైఎస్సార్ కేసులు పెట్టమన్నారంటూ ఓ పోలీస్ అధికారికి తనకు చెప్పినట్టు పవన్ అంటున్నారని, ఆ పోలీస్ అధికారికి తక్షణమే లై డిటెక్టర్ పరీక్ష చేయించాలని కేవీపీ డిమాండ్ చేశారు. "ఒకవేళ ఆ అధికారి చెప్పింది నిజమని తేలితే... నేను తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.10 కోట్లు విరాళంగా ఇస్తాను" అంటూ కేవీపీ ఒక బహిరంగ సవాల్ విసిరారు. మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి చనిపోయి 17 ఏళ్లు దాటిన తర్వాత కూడా.. ఇంకా ఆయనపై ఇలాంటి ఆధారాలు లేని ఆరోపణలు చేయడం అవివేకమని మండిపడ్డారు.

## నా యుద్ధ అధికారాల్ని పరిమితం చేయడం దేశద్రోహం

ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు తుది దశ చర్చలు జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఇదే సమయంలో తన యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానాన్ని అమెరికా ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్) ఆమోదించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తన దౌత్య ప్రయత్నాలకు ఆటంకం కలిగిస్తోందని విమర్శించారు. ట్రూత్ సోషల్ మీడియాలో చేసిన పోస్టులో... "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించేందుకు తుది దశ చర్చలు జరుగుతున్న సమయంలో హౌస్ అర్థంలేని ఓటింగ్ నిర్వహించింది. నలుగురు రిపబ్లికన్లు, డెమోక్రాట్లందరూ కలిసి నా యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి మద్దతు ఇచ్చారు" అని ధ్వజమెత్తారు. ప్రస్తుతం ఇరాన్‌తో చర్చలు ఏ దశలో ఉన్నాయో కాంగ్రెస్ సభ్యులకు పూర్తిగా తెలుసని, అయినప్పటికీ ఇలాంటి చర్యలకు పాల్పడటం దేశభక్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. "ఇలాంటి దేశ ప్రయోజనాలకు వ్యతిరేకమైన పని ఎవరు చేస్తారు?" అని ప్రశ్నించారు. చివరగా 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్ నినాదాన్ని ప్రస్తావిస్తూ తన మద్దతుదారులకు సందేశం పంపించారు.

# హైదరాబాద్‌లో ఎబోలా కలకలం గాంధీ ఆసుపత్రిలో ముగ్గురు అనుమానితులు

**ఒకే అంతర్జాతీయ విమానంలో ప్రయాణించిన ముగ్గురిలో లక్షణాలు**

**సూడాన్ నుంచి వచ్చిన ప్రయాణికుడికి ఎయిర్‌పోర్ట్‌లోనే గుర్తింపు**

**నిర్ధారణ కోసం నమూనాలను పుణె వైరాలజీ ల్యాబ్‌కు పంపిన అధికారులు**

**ఆందోళన వద్దని, అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆరోగ్య శాఖ వెల్లడి**




భాగ్యనగరంలో ఎబోలా వైరస్ కలకలం రేపుతోంది. ఎబోలా తరహా లక్షణాలతో ముగ్గురు వ్యక్తులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేరడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామంతో అప్రమత్తమైన తెలంగాణ ఆరోగ్య శాఖాధికారులు, బాధితులను ప్రత్యేక ఐసోలేషన్ వార్డుకు తరలించి వైద్యుల నిరంతర పర్యవేక్షణలో ఉంచారు. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం ఉదయం ఎబోలా ప్రాథమిక లక్షణాలతో ఇద్దరు వ్యక్తులు జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రిని ఆశ్రయించారు. పరిస్థితిని గమనించిన వైద్యులు వారిని తక్షణమే గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. దీంతో గాంధీలో చేరిన ఎబోలా అనుమానితుల సంఖ్య మూడుకు చేరుకుంది. ప్రాథమిక దర్యాప్తులో ఈ ముగ్గురు ఒకే అంతర్జాతీయ విమానంలో హైదరాబాద్‌కు చేరుకున్నట్లు వెల్లడి కావడంతో, సదరు విమానంలో ప్రయాణించిన ఇతర ప్రయాణికుల వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కాగా, అంతకుముందు గురువారం నాడు సూడాన్ నుంచి ఇథియోపియా మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న 30 ఏళ్ల వ్యక్తిని విమానాశ్రయ వైద్య బృందం గుర్తించింది. థర్మల్ స్క్రీనింగ్‌లో అతనికి 100 డిగ్రీల జ్వరం ఉన్నట్లు తేలింది. ఇటీవల ఎబోలా ప్రభావిత దేశాలైన ఉగాండా, దక్షిణ సూడాన్‌లలో అతడు పర్యటించినట్లు సమాచారం అందడంతో, అధికారులు ముందుజాగ్రత్తగా అతడిని గాంధీ ఆసుపత్రిలోని ఐసోలేషన్ వార్డుకు తరలించారు. ప్రస్తుతం ఆ ముగ్గురి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఎబోలా తీవ్రతను సూచించే రక్తస్రావం, వాంతులు వంటి లక్షణాలు ప్రస్తుతానికి ఎవరిలోనూ కనిపించడం లేదని వైద్యులు స్పష్టం చేశారు. బాధితుల నుంచి సేకరించిన నమూనాలను తుది నిర్ధారణ పరీక్షల నిమిత్తం పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (చీ×ఎ)కి పంపారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆరోగ్య శాఖాధికారులు భరోసా ఇచ్చారు. పుణె నుంచి వచ్చే నివేదికల ఆధారంగా తదుపరి కార్యాచరణ ఉంటుందని వారు వెల్లడించారు.



## డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని వినతి

నాచారం, వార్త మిర్రర్, జూన్ 4

నాచారం డివిజన్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయాల్సిందిగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ జలమండలి ఈడి పంకజని కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఇప్పటికే నాచారం డివిజన్లోని చాలావరకు డ్రైనేజీ సమస్యలను పరిష్కరించామని మిగిలిన కొన్ని పనులకు నిధులు మంజూరు చేసినట్లయితే డివిజన్లో డ్రైనేజీ సమస్యలు పూర్తిగా తీరుతాయని తెలియజేశారు. అలాగే కొన్ని మంజూరైన రోడ్ల డ్రైనేజీ ఏర్పాటు కాకపోవడం వల్ల ఆగిపోయాయని ఈడి దృష్టికి తీసుకొని రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో బారాస రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలపై జోనల్ కమిషనర్ కి కోలన్ శంకర్ రెడ్డి వినతి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి : 4 జూన్ :- జోనల్ కమిషనర్ చంద్రకళ కి ప్రజా సమస్యలపై వినతి పత్రం అందచేసిన బిజెపి రాష్ట్ర కోఆపరేటివ్ సెల్ కన్వీనర్ కోలన్ శంకర్ రెడ్డి బిజెపి శ్రేణులలతో కలసి గురువారం గ్రేటర్ హైదరాబాద్ లోని బడంగుపేట సర్కిల్ పరిధిలోని 60 వ డివిజన్ లో దాతునగర్, సాయి గణేష్ నగర్, సుభాష్ చంద్రబోస్ కాలనీ, సాయి కృప కాలనీ, జయభారత్ నగర్ ఆఫీసర్స్ కాలనీ లలోని గుంతలు గా మారిన రోడ్లు మరమ్మతులు చేయాలని, పార్క్ ఏరియా లో పండగల ఉత్సవాల కొరకు షెడ్ నిర్మాణం చేపట్టాలని , వీధి దీపాలు ఏర్పాటు, దోమల నివారణకు ఫాగ్ చేయాలని, తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ ఎంపీ ఈటల రాజేందర్ ఇచ్చిన వినతి పత్రాన్ని శంసాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ కి అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు సత్యప్రకాష్ జీ, గంగవరం సురేష్, జై కాంత్ గుప్తా, దినేష్ , తదితరులు పాల్గొన్నారు

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 4



జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన ధన రేకుల రాజేష్ తండ్రి నడిపి సంత మల్లయ్య 37 సంవత్సరాలు కులం యాదవ అను వ్యక్తి వ్యవసాయం, గొర్ల పెంపకంలో నష్టం రాగా రెండు సంవత్సరాల క్రితం గల్ఫ్ దేశానికి వెళ్లగా అక్కడ పని సరిగా దొరకపోవడం వల్ల అప్పులు ఇంకా ఎక్కువ కావడం వల్ల డిప్రెషన్ కు లోనై మద్యానికి బానిస అయినాడు. అప్పులు ఎక్కువ అవ్వడం వల్ల ఎప్పుడు అప్పుల వల్ల చనిపోతానంటూ అనేవాడు. అదే క్రమంలో తేదీ 1-6-2026 రోజున రాత్రి 11 గంటలకు ఇంట్లో ఉరి పెట్టుకోగా భార్య తల్లి తండ్రులు చూసి ఆత్మహత్య ప్రయత్నాన్ని ఆపినారు. తర్వాత తేదీ 3.6. 2026 రోజున రాత్రి 11 గంటల సమయంలో కుటుంబ సభ్యులంతా బంగ్లా మీద పడుకుని ఉండగా ధన రేకుల రాజేష్ ఒక్కడే కిందికి రాగా అతని గమనించిన భార్య కిందికి వచ్చి ఎటు వెళ్తున్నావని అడిగే లోపు తలుపులు వేసుకొని గడియ పెట్టుకొగా కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా తలుపులు తీయకపోవడంతో తలుపులు పగలగొట్టే ప్రయత్నం చేయగా తలుపులు పగల పగలకపోవడంతో పక్కనే ఉన్న కిటికీ అద్దాలు పగలగొట్టి గ్రిల్స్ తీసివేసి లోపలికి వెళ్లి చూడగా ధన రేకుల రాజేష్ బెడ్ రూమ్ లోని ఫ్యానుకు నల్లని తాడుతో ఉరివేసుకొని ఉండగా కుటుంబ సభ్యులు కిందకు దింపి చూడగా అప్పటికే చనిపోయినాడు అని మృతుని భార్య తన రేకుల లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయికల్ ఎస్సై సుదీర్ రావు తెలిపినారు.




## ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక అవగాహన సభ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 4

గురువారం రోజున తెలంగాణా రాష్ట్రం ప్రతిష్టాత్మకశీగా నిర్వహిస్తున్నటువంటి ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమశీలో భాగంగా మన జగిత్యాల జిల్లా రాయికల్ మండలశీలోని శ్రీరాంనగర్, కుర్మపల్లి, జగన్నాథపూర్, ఖైరిగూడెం గ్రామాలలో ఈ క్రింద తెలిపిన ఎజెండా అంశాల పైన ప్రత్యేక గ్రామ సభ నిర్వహించి గ్రామ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించడం జరిగినది. 1.వర్షాకాల ముందస్తు చర్యలు,2.ఘన వ్యర్థాల నిర్వహణ అండ్ సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ నిర్వహణ 3. జల సంరక్షణ - మన సంరక్షణ, 4. వన మహోత్సవశీ, పర్యావరణ పరిరక్షణ, 5.సురక్షితమైన త్రాగునీరు, 6.ఎ లినినో కారణముగా వ్యవసాయశీ లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు 7.మహిళా సంరక్షణ పై అవగాహన, 8.అరైవ్-అలీవ్ పై అవగాహన పై అంశములపై చర్చించి గ్రామశీలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించనైనది. ఇట్టి కార్యక్రమశీలో ఎంపీడీఓ శ్రీ బి. చిరంజీవి, తహసీల్దార్ శ్రీ నాగార్జున, ఎంపీవో కె.సుష్మ, ఆయా శాఖల మండల అధికారులు, ఆయా సర్పంచులు, ఉప సర్పంచులు, పిఎస్ఎస్ ప్రజాప్రతి నిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తాజ్ పూర్ లో ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక గ్రామసభ

### హాజరైన సీఈవో- ఎంఈఓ- పలు శాఖల అధికారులు





యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

భువనగిరి మండలం తాజ్ పూర్ లో ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99రోజులు కార్యక్రమం లో భాగంగా 'గ్రామ సభ ప్రత్యేక అతిధులుగా జిల్లా సీఈవో ,ఎంఈఓ మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు......ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా గ్రామ సర్పంచ్ గారి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించడం జరిగింది.ఈ సందర్బంగా గౌరవ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష- శ్రీనివాస్ గారు మాట్లాడుతూ సర్పంచ్ గా బాధ్యత లు స్వీకరించిన ఈ ఐదు నెలల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ముఖ్యంగా గ్రామ పరిశుభ్రత ప్రజల భద్రత లక్ష్యంగా మా స్వంత ఖర్చులతో ఇంటింటికి తడి చెత్త -పొడి చెత్త డబ్బాలను అందచేశామని సూచించిన విదంగా పాటించాలని కోరడం జరిగింది.. అందులో భాగంగా సూచించిన పద్దతిలో పాటించిన ఇద్దరు మహిళలను గౌరవ సర్పంచ్ సన్మానించడం జరిగింది... అదే విదంగా యువత మద్యం, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకూడదని సూచించడం జరిగింది... గ్రామ ప్రజలకు ఏ విధమైన వచ్చినా నేరుగా సంప్రదించాలని 24 గంటలు అందుబాటులో ఉంటానని చెప్పడం జరిగింది.. అదేవిదంగా స్వంత ఖర్చులతో ప్రభుత్వ పాఠశాల ను అభివృద్ధి చేయడం జరిగింది చక్కని సౌకర్యాలు, వసతులు, మంచి అధ్యాపక బృందం, ప్రైవేట్ పాఠశాల కు ధీటుగా రూపుదిద్దామని తల్లిదండ్రులు మీ పిల్లలను ప్రభుత్వ బడికి పంపాలని ఈ సందర్భంగా కోరడం జరిగింది.. ఈ కార్యక్రమం లో జిల్లా పరిషత్ సీఈవో శోభారాణి, ఎం ఈ ఓ, వివిధ శాఖల అధికారులు, సామజిక వేత్త డా, ర్యాకల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గం సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, యూత్ నాయకులు,గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు

# మైతాపూర్ లో ఘనంగా పెద్దమ్మ తల్లి పండుగ లు



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 4

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మైతాపూర్ గ్రామములో గురువారం రోజున గ్రామ దేవత అయిన పెద్దమ్మ తల్లి పండుగను గ్రామంలో ఉన్న అన్ని కులాలకు చెందిన కుల పెద్దలు అన్ని సంఘము ల అధ్వర్యం లో ఆయా సంఘాల అధ్యక్ష కార్యదర్శుల సభ్యులు అందరూ కలిసి డప్పు చపులతొ గొర్రె పొట్టేళ్ళు తో గ్రామంలో ఉన్న పోరుమల్ల రోడ్డు లో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించారు. దీనికంటే ముందు యాదవ సంఘం ఆధ్వర్యంలో పోయిన వారం రోజుల క్రితం కుమ్మరి పెల్లి గ్రామంలో ఉన్న పెద్దమ్మా తల్లి వద్దకి వెళ్ళి అక్కడ మొక్కులు తీర్చుకొని వచ్చిన వారం రోజుల తరువాత మైతాపూర్ లో పెద్దమ్మ తల్లి పండుగ, ఒక్కొక్క పండుగ లు అన్ని రకాల పండుగ లు జరుపుకుంటారు. గ్రామంలో అందరూ కలిసి కట్టుగా ఉండాలని పిల్ల పాపలు చల్లగా ఉండాలని, వ్యవసాయ దారులకు పాడిపంటలు, దినుసులు రైతులకు బాగా పండాలని పాడి పశువులు అభివృద్ధి చెందాలని ఇతర కుల వృత్తులకు ఎలాంటి ఆటంకాలు జరగకుండా చూడాలని కోరారు. ప్రతి సంవత్సరం కుమ్మరి పెల్లి పెద్దమ్మ తల్లి వద్దకు వెళ్లి యాదవ సంఘం వారు మొక్కులు చెల్లించుకోని రావడం గతంలో నుండి వస్తున్న ఆచారం అని, గ్రామంలో ఉన్న నాటి కాలం పెద్దమనుష్యులు అంటున్నారు.

# ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి ఉపాధ్యాయుల, గ్రామస్థుల ఆర్థిక సాయం



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 4 కడు పేదరికంలో ఉండి కూడా సరస్వతి మాత కరుణను పొందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని 10వ తరగతి లో 562 మార్కులు సాధించి మొదటి లిస్ట్ లోనే బాసరకు ఎంపికయింది. కానీ అమ్మాయి తాడూరి అన్విత కడు పేదరికాన్ని అనుభవిస్తుంది. ఈ మధ్యే అమ్మాయి తండ్రి మరణం ఆమెను కుంగదీసింది. అమ్మాయికి ట్రిపుల్ ఐటీ లో సీటు వచ్చింది కానీ చేతిలో చిల్లి గవ్వ లేని పరిస్థితి. ఈ క్రమంలో అమ్మాయి చదివిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూపతిపూర్ ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ పాఠశాలల ఉపాధ్యాయులు, మల్యాల పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయులు, తాటిపెల్లి పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయులు అలాగే భూపతిపూర్ ప్రధానోపాధ్యాయురాలు రమణి, ఉపాధ్యాయు బృందం 22,000 వేలు, భూపతిపూర్ గ్రామ దాతల ద్వారా 8000/- మొత్తంగా జమ అయిన 30,000/- వేలను ఈ రోజు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొల్లె చిన్నయ్య, కూరగాయల సురేష్ దాతలు రాజేంద్ర ప్రసాద్, మారంపెల్లి లక్ష్మీనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ మామిడిపల్లి మహేష్, చింతలూరు గ్రామ సర్పంచ్ రమేష్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, రవి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అనారోగ్య సమస్యలతో వృద్దురాలు ఆత్మహత్య



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 4జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మైతాపూర్ గ్రామానికి చెందిన పుట్ట దేవక్క తండ్రి గంగారం 21 సంవత్సరాలు కులం మాల అనునామి గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది మహితాపూర్ శివారులోని బావిలో దూకి చనిపోగా అటువైపు వెళ్లిన గ్రామస్తులు చూసి సమాచార ఇచ్చినారని మృతురాలి వరుసకు కోడలైన మేదరి స్రవంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏ ఎస్ ఐ దేవేందర్ తెలిపినారు



## నీటి, వాయువు కాలుష్యం వాటి పరిణామాల పై వ్యాస రచన పోటీలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 4

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అటవీ కార్యాలయం రాయికల్ నందు అటవీ క్షేత్ర అధికారి రాయికల్ ఆధ్వర్యంలో ఎన్విరాన్మెంట్ నీటి వాయువు కాలుష్యం వాటి పరిణామాలు మరియు నియంత్రణ గురించి స్థానిక విద్యార్థులతో వ్యాసరచన పోటీలు నిర్వహించి అవగాహన కల్పించారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు డిక్షనరీలు ఎగ్జామ్ ప్యాడ్స్ కంపాస్ బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అటవీ క్షేత్ర అధికారి రాయికల్ టి భూమేష్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పద్మ ఎఫ్ ఎస్ ఓ రత్నమ్మ, శ్రీనివాస్, బీట్ ఆఫీసర్లు రమణారెడ్డి, రత్నాకర్, సంధ్య, కవిత, విజయ, ఇలియాజ్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.




## తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఆవిష్కరణ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 4జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం లోని అంగడి బజార్ లో గురువారం రోజున తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా పండుగలో భాగంగా జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ పునుగోటి పవన్ రావు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు..ఈ కార్యక్రమానికి స్టేట్ అబ్జర్వర్ మాధవి మరిపెల్లి, జిల్లా ఇంఛార్జ్ చెర్లపల్లి అమర్దీప్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు నీలగిరి రాజేందర్, నందు నాయక్, ముహమ్మద్ ఇంతియాజ్, కొల్లూరి వేణు పటేల్, పురుషోత్తం రావు, శ్రీకర్, వొద్దినేని వెంకటేష్, రిజ్వాన్, సుజాత, యుగేందర్, రమేష్, రవీందర్ నాయక్, రవి, మ్యాక మారుతి, వంశీ, నరేందర్, సోమయ్య, రవి ప్రసాద్, ప్రదీప్, సునీల్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రీ ప్రైమరీ పాఠశాలలో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వార్త మిర్రర్, మందమర్రి జూన్ 4:

మండలంలోని ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఇన్స్ట్రక్టర్, ఆయా పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి రాథోడ్ రమేష్ తెలిపారు. 2026 27 విద్యా సంవత్సరానికి గాను 10 నెలల కాలపరిమితికిగాను తాత్కాలిక పద్ధతిలో పోస్టులను బర్తీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపీపీఎస్ విద్యానగర్, కళ్యాణిఖని, రామకృష్ణాపూర్ టౌన్, భగత్ సింగ్ నగర్, ఎంపియుపిఎస్ కోటేశ్వరరావుపల్లి పాఠశాలల్లో ఇన్స్ట్రక్టర్, ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రీ ప్రైమరీ పోస్టులకు ఇంటర్మీడియట్, ఆయా పోస్టులకు ఏడవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. అర్హులైన ఆసక్తి కలిగిన స్థానిక అభ్యర్థులు ఈ నెల 4 నుండి 8వ తేదీ లోపల సంబంధిత పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

# హల్లెల్ మ్యూజిక్ స్కూల్ విద్యార్థులు

## గిన్నిస్ బుక్ రికార్డు

## ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ముందు విద్యార్థులు సన్మానించిన వరంగల్ రవి





సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 4 : మ్యూజిక్ కీ బోర్డు వాయించడంలో గిన్నిస్ బుక్ రికార్డు సృష్టించిన విద్యార్థులకు ఘన సన్మానం జరిగింది. సంగీతంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు వరంగల్ రవి సన్మానించారు. హైదరాబాద్ విక్టరీ ఆడిటోరియంలో నిర్వహించిన గిన్నిస్ అచీవ్‌మెంట్ మీట్‌లో రికార్డు సాధించిన మ్యూజిక్ విద్యార్థులను ఓయూలోని ఆర్ట్స్ కళాశాల ముందు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రవి.. సంగీత రంగంలో అంతర్జాతీయ స్థాయిలో గిన్నిస్ రికార్డు సాధించడం ఎంతో గర్వకారణం అన్నారు. హల్లెల్ మ్యూజిక్ స్కూల్ విద్యార్థులు తెలంగాణకు మంచి పేరు తీసుకొచ్చారనీ.. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నానన్నారు. ఈ సంగీత కార్యక్రమంలో 22 దేశాలకు చెందిన 2 వేల మంది కీబోర్డ్ వాద్యకారులు గంటపాటు నిరంతరాయంగా ప్రదర్శన ఇచ్చారు. ఈ ఈవెంట్స్ లో పాల్గొన్న 777 మంది వాద్యకారులకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించి సంస్థ సర్టిఫికెట్లు అందజేసింది. ఎంతోమందికి ఉచితంగా సంగీతాన్ని నేర్పిస్తున్న హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఫౌండర్ డైరెక్టర్ అగస్టీన్ దండంగి ను ఈ సందర్భంగా వరంగల్ రవి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఓయూ విద్యార్థి నాయకులు నరసింహ, కొమ్ము శేఖర్, జంగిలి దర్శన్, పాండు కురుమ, ఆర్గనైజర్ అండ్ హల్లెల్ హైదరాబాద్ ఇంచార్జ్ రేమ, ఓయూ ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్, ప్రొఫెసర్ డైసీ, జి.నరహరి, ఎవేలిన్ గీత, మోసెస్ దేవదాస్, డి.శివాని, అమూల్య, సాల్మన్ రాజ్, శామ్యూల్ రాజ్, జేశురన్, డానియల్ రాజ్, జోయల్, వైష్ణవి, తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పప్పు దినుసులకు కూడా ప్రోత్సాహం కల్పించాలి

## యూరియా రైతులు కొనుగోలు చేయాలంటే ఆప్ బ్లాక్ చేసి ఉంది

## బి ఆర్ ఎస్ జనరల్ సెక్రటరీ టీ. జీవన్ రెడ్డి

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 4

జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలో మాజీ మంత్రి బి ఆర్ ఎస్ పార్టీ జెనరల్ సెక్రటరీ తాటిపర్తి జీవన్ రెడ్డి పత్రిక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు ఖరీఫ్ పంటకు సన్నద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైనది. రైతు భరోసా కనుమరుగైనట్టు కనబడుతుంది. పంట రుణాలకు సంబంధించి తగు కార్యరూపచరణ కనబడుటలేదు. కనీసం ఖరీఫ్లోనైనా రైతు భరోసా కల్పించాలి. ధాన్యం సేకరణలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అది అందరికీ తెలిసిందే. కాంగ్రెస్, బీజేపీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు తప్ప సమన్వయంతో రైతు గురించి ఆలోచన చేయడం లేదు. ప్రత్యామ్నాయంగా పప్పు దినుసులు నూనె గింజలు పండించాలని సలహా ఇచ్చినట్టు గమనించాము. పప్పు దినుసులకు నూనె గింజలకు ఏ విధమైన ప్రోత్సాహం ప్రభుత్వం కల్పించబోతున్నదో చెప్పండి. ఒక ఎకరానికి వరి సాగులో పెట్టుబడి పోగా 25 వేల వరకు మిగులుతాయి మొక్కజొన్నలో 30 వేల వరకు మిగులుతాయి. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా రైతు ఆయన పామాయిల్ పెట్టుకుంటే అతనికి కోతుల బెడద లేకపోవచ్చు కానీ మాకు ఆర్తడి పంటలకు కోతుల బెడద ఎక్కడైనా ఉంది. కోతులకు పునరుత్పత్తి నిలుపుదల కేంద్రాన్ని జిల్లాకు ఒకటి ఏర్పాటు చేయాలి. తక్షణమే రైతుకు సోలార్ ఫెన్సింగ్ 50% రాయితీతో ఇవ్వాలి. విత్తన రాయితీ కూడా కనుమరుగయింది. ఆరుతడి పంటలకు ప్రత్యామ్నాయంగా కావాలంటే రైతులకు విత్తనాలు 50% రాయితీతో ఇవ్వండి. రైతులను రసాయనిక ఎరువుల నుండి సేంద్రీయ ఎరువుల వైపు మళ్ళించాలని భావిస్తున్నాం కానీ పచ్చిరొట్ట జనుము జీలుగు విత్తనాల భారం ఎకరానికి 2000 వరకు పడుతుంది. వరి ధాన్యానికి సన్న రకాలకు క్వింటాల్కు 500 బోనస్ ఇస్తా అన్నారు అంటే ఎకరాన 20 కింటలకు 10,000 వరకు బోనసిస్తున్నారు. అలాగే పప్పు దినుసులకు కూడా ప్రోత్సాహం కల్పించాలి. ఎందుకంటే పప్పు దినుసులు ఎకరానికి 5 క్వింటాళ్లకి మించి పండవు. పప్పు దినుసులు పండించాలంటే ప్రధానంగా కోతుల బెడద, గిట్టుబాటు ధర లేకపోవడం. జనము, జీలుగు విత్తనాలు ఉచితంగా ఇచ్చిన తప్పులేదు. గత సంవత్సరం కిలో 40 రూపాయలు ఉంటే ఇప్పుడు 80 రూపాయలు అయింది. అసలు ఈ విషయం ముఖ్యమంత్రికి, వ్యవసాయ శాఖ మంత్రి కి తెలుసో లేదో తెలియదు. డిఏపి 1800 నుండి 2300 అయింది. మార్కెట్లో యూరియా అందుబాటులో లేదు. యూరియా స్టాక్ ఉంది కానీ రైతులు కొనుగోలు చేయాలంటే ఆప్ బ్లాక్ చేసి ఉంది. ఆప్ ను బ్లాక్ తీసేసి గతంలో ఏ విధంగా అందుబాటులో ఉండెనో ఆ విధంగా అందుబాటులోకి తేవాలి. అదేం తినేది కాదు తాగేది కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయి మూడు సంవత్సరాలు అయినప్పటికీ ఆరు పంటలు పడినవి ఇందులో ఎన్ని పంటలకు రైతు భరోసా కల్పించావో నీ ఆత్మకే తెలుసు. మేము రాజకీయపరంగా బీఆర్ఎస్ కు సపోర్ట్ గా ఉన్నా మేమందరం రైతు కుటుంబం నుండి వచ్చాం. రైతుకు మేలు చేసే ప్రయత్నం చేయండి. ఈ కార్యక్రమంలో యువజన నాయకుడు తాటిపర్తి సీకే రెడ్డి, గోపి రాజిరెడ్డి , బర్కం మల్లేశం , కొయ్యేడి మహిపాల్, ఉదయశ్రీ, శ్రీధర్ రెడ్డి, రాకేష్, గుమ్మడి సంతోష్ ,బత్తిని భూమన్న, నగరాజ్ , రాజేందర్ గౌడ్, వల్లకొండ మహేష్ ,పొన్నం శ్రీకాంత్, హరీష్ రావు, మండ రమేష్, రాజీవ్, రవి, సాయి, సత్యనారాయణ, మహేందర్, కలీల్, జక్కుల రవి, మంజూరు, వివిధ హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.



# చౌటుప్పల్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం: చైర్‌పర్సన్ పావని

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 06

చౌటుప్పల్ పురపాలక సంఘం పరిధిలో "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక"లో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక వార్డు సభలు గురువారం నిర్వహించారు. 1, 2, 3, 12, 13వ వార్డుల్లో స్థానిక కౌన్సిలర్ల అధ్యక్షతన ప్రజలతో ముఖాముఖి సమావేశాలు జరిగాయి. ఈ సభలకు మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, మండల తహసీల్దార్ వీరాబాయి ముఖ్య అతిథులుగా పాల్గొనడం జరిగింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాగిన ఈ సభల్లో చైర్‌పర్సన్ స్వయంగా ఐదు వార్డుల ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ పట్టణాన్ని ఆదర్శవంతమైన ప్రగతి పథంలో నడిపిస్తామని తెలిపారు. ప్రతి వార్డులో ఉన్న ప్రజా సమస్యలను వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు. హెల్త్, పోలీస్, మున్సిపల్, అగ్రికల్చర్, ఎలక్ట్రికల్, రెవెన్యూ శాఖల అధికారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్త్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ కాటమరాజు మాట్లాడుతూ.. వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. చౌటుప్పల్ సీఐ జి. మన్మధ కుమార్ మాట్లాడుతూ.. పెరుగుతున్న సైబర్ నేరాలు, చిన్న పిల్లలు మత్తు పదార్థాలకు బానిసలవడం వల్ల కలిగే నష్టాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాల గురించి ప్రజలకు వివరించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలు, మున్సిపల్ పరిధిలో తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం, ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్రికల్చర్ ఏఈ, ఎలక్ట్రికల్ లైన్‌మెన్ తదితర అధికారులు స్థానిక సమస్యలపై స్పందించి సూచనలు చేశారు. 1వ వార్డు రైతు వేదిక ప్రాంగణంలో కౌన్సిలర్ కోసనం రాకేష్ రెడ్డి అధ్యక్షతన సభ జరిగింది. 2వ వార్డు తాళ్లసింగారం వార్డు కార్యాలయంలో కౌన్సిలర్ పోలేపల్లి లక్ష్మి ముత్తయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 3వ వార్డు లింగోజిగూడెం వార్డు కార్యాలయంలో కౌన్సిలర్ పల్లె లావణ్య సురేందర్ రెడ్డి అధ్యక్షతన ప్రజా సమస్యలపై చర్చించారు. 13వ వార్డు భాస్కర్ టాకీస్ ఆవరణలో కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్ అధ్యక్షతన సభ జరిగింది. 12వ వార్డు గణేష్ మండపం, సురివి రమేష్ ఇంటి వద్ద కౌన్సిలర్ పాక చిరంజీవి అధ్యక్షతన, కోఆప్షన్ సభ్యులు షేక్ నబీబి జానీ బాబు ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలను పరిశీలించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఒకే వేదికపైకి వచ్చి తమ సమస్యలను నేరుగా వినడం పట్ల ఆయా వార్డుల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు సభల నోడల్ అధికారులు, స్థానిక ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ఈ ట్రిక్స్ పాటిస్తే తత్కాల్ టికెట్లు మీకు దొరకడం ఫిక్స్.. చేయకూడని తప్పులివే..

తత్కాల్ టికెట్ల గురించి అందరికీ తెలిసే ఉంటుంది.

ఈ టికెట్లను పొందటం అంత సులువైన పని కాదు. జస్ట్ నిమిషాల వ్యవధిలోనే టికెట్లు అన్నీ అయిపోతాయి. కానీ కొన్ని ట్రిక్స్ ష్లటించడం వల్ల మీరు తత్కాల్ టికెట్ల రేసులో గెలవొచ్చు. అవేంటి అంటే.. రైళ్లల్లో ఎక్కడికైనా అత్యవసరంగా ప్రయాణం చేయాలనుకుంటే తత్కాల్ టికెట్లనే దిక్కు. చివరి నిమిషంలో ప్రయాణం చేయాలనుకునేవారు ఈ టికెట్ల మీదనే ఆధారపడతారు. అయితే ఈ టికెట్లను పొందటం అంత సులువు కాదు. వీటికి ఉన్న డిమాండ్ కారణంగా పొందేందుకు పోటీ పడాల్సిందే. ఉదయం 10 లేదా 11 గంటలకు టికెట్లను విడుదల చేయగానే కొన్ని గంటల్లో అయిపోతాయి. అయితే కొన్ని చిట్కాలను పాటించడం వల్ల తత్కాల్ టికెట్లను సులువుగా పొందవచ్చు. అవేంటి అనేది ఇప్పుడు చూద్దాం. ఈ ట్రిక్స్ పాటించండి-బుకింగ్ ప్రారంభం కాగానే ప్రయాణికుల పేరు, వయస్సు, జెండర్ లాంటివి నమోదు చేయడానికి కనీసం 30 నుండి 45 సెకన్ల సమయం పడుతుంది. దీంతో బుకింగ్ ప్రారంభం కావడానికి అరగంట ముందు మీ ×=ఋజ అకౌంట్లోకి వెళ్లి "మై ప్రొఫైల్" విభాగానికి వెళ్లి ఒక మాస్టర్ లిస్ట్‌ను సృష్టించుకోవచ్చు. అక్కడ ప్రయాణికులందరి పేర్లను ముందుగానే సేవ్ చేసుకోవడం వల్ల బుకింగ్ సమయంలో సమయం వృధా కాదు. బుకింగ్ చేసేటప్పుడు మీరు కేవలం పేర్లను ఎంచుకుంటే సరిపోతుంది. -ఇక పేమెంట్స్ చేసేటప్పుడు బ్యాంక్ ఓటీపీల మీద ఆధారపడటం వల్ల సమయం వృథా అవుతుంది. అందుకే ఖూ× లేదా ×=ఋజ వాలెట్‌ను ఉపయోగించండి. దీని వల్ల ఒక్క క్లిక్‌తో చెల్లింపులు చేయవచ్చు.



# విదేశీ పౌరుల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి... సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కె. మూర్తి



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 4 : సికింద్రాబాద్ జోన్ పరిధిలో విదేశీ పౌరులకు వసతి కల్పించే వ్యక్తులు, సంస్థలు విద్యాసంస్థలు వారి వివరాలను తప్పనిసరిగా సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కె. మూర్తి సూచించారు. ఇమ్మిగ్రేషన్ ఫారినర్స్ యాక్ట్--2025 ప్రకారం విదేశీ పౌరులు, విదేశీ విద్యార్థులకు వసతి కల్పించే హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లు, ఆసుపత్రులు, ఇంటి యజమానులు మరియు ఇతర నివాస సౌకర్యాల నిర్వాహకులు ఫామ్-111(సి) ద్వారా పూర్తి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే విదేశీ విద్యార్థులు చదువుతున్న విద్యాసంస్థలు ఫామ్ 11, మరియు 111(సి) ద్వారా వారి సమాచారాన్ని సమర్పించాలని సూచించారు. విదేశీ పాస్‌పోర్ట్ కలిగిన వారు, ఓ సి ఐ కార్డు కలిగిన వారు, నేపాల్ దేశ పౌరులు కూడా ఈ నిబంధనల పరిధిలోకి వస్తారని పేర్కొన్నారు. నమోదైన సమాచారాన్ని కనీసం ఒక సంవత్సరం పాటు భద్రపరచాలని సూచించారు. విదేశీ పౌరుల వివరాల నమోదు కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఎఫ్ ఆర్ ఆర్ ఓ పోర్టల్‌ను వినియోగించాలని తెలిపారు. ఫామ్ 11 లేదా ఫామ్ 111 ఖీశీతీఎ-11 సమర్పించడంలో విఫలమైనా, తప్పుడు సమాచారం అందించినా, ఉద్దేశపూర్వకంగా వివరాలను దాచిపెట్టినా ఫార్నెర్స్ యాక్ట్ సెక్షన్-23 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, విద్యాసంస్థలు మరియు వసతి కల్పించే సంస్థలు చట్ట నిబంధనలను పాటించి సంబంధిత వివరాలను సకాలంలో నమోదు చేయాలని డీసీపీ రక్షిత కె. మూర్తి విజ్ఞప్తి చేశారు.




# క్రెడిట్ కార్డు బిల్లును ఈఎంఐలోకి మారుస్తున్నారా..? లాభ, నష్టాలు ఇవే..

క్రెడిట్ కార్డు బిల్లు కట్టలేక చాలామంది ఇబ్బందులు పడుతూ ఉంటారు. అలాంటివారు బిల్లును ఈఎంఐ రూపంలోకి మారుస్తారు. ఇలా మార్చడం వల్ల బిల్లు తగ్గుతుందని, వాయిదాల రూపంలో కట్టవచ్చని అనుకుంటారు. ఇలా చేయడం వల్ల లాభ, నష్టాలు ఏంటి? అనే వివరాలు చూద్దాం. ఈ మధ్య అందరూ క్రెడిట్ కార్డ్ వాడుతున్నారు. క్రెడిట్ కార్డ్ లేనివారంటూ ఎవరూ కనిపించడం లేదు. ఉద్యోగులు, వ్యాపారవేత్తలు అనే సంబంధం లేకుండా సామాన్యుల నుంచి వ్యాపారవేత్తల వరకు ప్రతీఒక్కరూ క్రెడిట్ కార్డ్ వాడుతున్నారు. అంతలా క్రెడిట్ కార్డ్ వినియోగం అనేది పెరిగిపోయింది. బ్యాంకులు కూడా తమ ఆదాయాన్ని పెంచుకునేందుకు క్రెడిట్ కార్డులను తెగ జారీ చేస్తున్నాయి. కస్టమర్లకు ఫోన్ చేసి మరీ క్రెడిట్ కార్డు తీసుకుంటే అనేక డిస్కౌంట్స్ ఇస్తామంటూ ఆఫర్లు మీద ఆఫర్లు ఇస్తున్నాయి. ఈ ఆఫర్లకు ఆశపడి క్రెడిట్ కార్డు తీసుకునేవారు కూడా ఉన్నారు. అయితే క్రెడిట్ కార్డువాడేవారు చాలామంది బిల్లు కట్టలేక.. ఆ బిల్లును ఈఎంఐ రూపంలోకి మార్చుకుంటారు. ఇలా మార్చుకోవడం వల్ల ఎలాంటి నష్టాలు ఉంటాయి..? బిల్లును ఈఎంఐ రూపంలో కి మార్చుకోవడం వల్ల సిబిల్ స్కోర్ ఎఫెక్ట్ అవుతుందా అనే విషయాలు చూద్దాం.

### సిబిల్ స్కోర్ పెరిగే అవకాశం

బిల్లును ఈఎంఐగా మార్చుకున్నప్పుడు.. టైమ్ ప్రకారం ఈఎంఐ చెల్లించాలి. ఇలాంటి సమయంలో మీ సిబిల్ స్కోర్ పెరుగుతుంది. అంతేకాకుండా క్రెడిట్ యుటిలైజేషన్ రేషియా పెరగకుండా చూసుకోవాలి. ఈ రేషియా 30 శాతంగా ఉంటుంది. దీనిని మించి మీరు ఖర్చు చేస్తే సిబిల్ స్కోర్ పడిపోతుంది. ఇక మీరు ఈఎంఐగా మార్చుకోవడం వల్ల బిల్లు చెల్లించాల్సిన సమయం కూడా పెరుగుతుంది.

### నష్టాలు ఇవే

బిల్లును ఈఎంఐ రూపంలోకి మార్చుకున్నందుకు ప్రాజెసింగ్ ఫీజ్, జీఎస్టీతో పాటు ఇతర ఫీజులు చాలా ఎక్కువగా ఉంటాయి. ఈ ఛార్జీలను మీ క్రెడిట్ కార్డు నుంచే బ్యాంకులు తీసుకుంటాయి. ఈఎంఐలు సకాలంలో చెల్లించకపోతే లేట్ ఫీజులు భారీగా ఉంటాయి. వీటిని గమనించుకుని క్రెడిట్ కార్డ్ బిల్లును ఈఎంఐ రూపంలోకి మార్చుకోవాలి. అవగాహన లేకుండా మార్చుకుంటే మీకే నష్టం జరుగుతుంది.



# గుడ్ న్యూస్.. త్వరలో కూత పెట్టనున్న వందే భారత్ స్లీపర్ రైళ్లు.. డేట్ ఫిక్స్..

వందే భారత్ రైళ్లు ఇండియాలో విజయవంతం కావడం, ప్రయాణికుల రద్దీ పెరుగుతుండటంతో స్లీపర్ రైళ్లను కూడా తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ప్రయత్నాలు చేస్తోంది. వీటి తయారీ వేగంగా జరుగుతుండగా.. త్వరలోనే ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ఆ వివరాలు ఏంటో చూద్దాం. వందే భారత్ రైళ్లు ప్రస్తుతం దేశవ్యాప్తంగా సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే. విడతల వారీగా ప్రధాన నగరాలన్నింటికీ ఈ సేవలను కేంద్రం ప్రవేశపెట్టింది. వందే భారత్ రైళ్ల రాకతో లగ్జరీతో పాటు వేగంగా ప్రయాణం చేయగలిగే సదుపాయం ప్రజలుకు అందుబాటులోకి వచ్చింది. అయితే ప్రస్తుతం నడుస్తున్న వందే భారత్ ట్రైన్లలో ఛైర్ కార్, నార్మల్ సిట్టింగ్ మాత్రమే అందుబాటులో ఉంటుంది. స్లీపర్ క్లాస్ ప్రస్తుతం సర్వీసులు అందిస్తున్న వందే భారత్ ట్రైన్లలో అందుబాటులో లేదు. అయతే త్వరలో స్లీపర్ క్లాస్ ట్రైన్లు కూడా అందుబాటులోకి రానున్నాయి. ఈ డిసెంబర్‌లో వందే భారత్ స్లీపర్ రైళ్లను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ క్లారిటీ ఇచ్చారు. మొదటి ప్రొటోటైప్ స్లీపర్ రైళ్లల్లో కొన్ని సమస్యలు గుర్తించగా.. వాటిల్లో మార్పులు చేస్తున్నారు. వీటి సరిచేసిన తర్వాత మెరుగైన నాణ్యతతో స్లీపర్ రైళ్లు రాబోతున్నట్లు ఆయన చెప్పారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం, అత్యంత ప్రమాణాలతో కూడిన ప్రయాణం అందించేందుకు ఒక్క చిన్న నిర్లక్ష్యం కూడా లేకుండా తీర్చిదిద్దుతున్నట్లు స్పష్టం చేశారు. కొత్త వందే భారత్ స్లీపర్ రైలులో మొత్తం 16 కోచ్‌లు ఉంటాయి. 11 ఏసీ 3 టైర్, 4 ఏసీ 2 టైర్, ఒకటి ఏసీ ఫస్ట్ క్లాస్ ఉంటాయి. ఇంటిగ్రేటెడ్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్, విజువల్ డిస్‌ప్లే, కెమెరాలు, మాడ్యులర్ కిచెన్, నైట్ లైటింగ్ వంటి అత్యాధునిక కెమెరాలతో స్లీపర్ రైళ్లు త్వరలో పరుగులు తీయనున్నాయి. ఇక బయో వాక్యూమ్ టాయిలెట్లు,